క్లుప్తంగా

ధనమహాలక్ష్మి తల్లికి సారె సమర్పణ



కొంగోడులో అమ్మవారికి సమర్పించిన చీర, సారె

కరప: కొంగోడు గ్రామ దేవత ధనమహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం మహిళలు చీర, సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని ఆడపడచులు, మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, చలివిడి, వడ పప్పు, వివిధ రకాల స్వీట్లు ఉంచిన బిందెలను తలపై ఉంచుకుని, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో బిందెలు, అరటిపండ్ల గెలలతో, పట్టుచీర కావిడితో గ్రామంలో ఊరేగారు. అనంతరం అమ్మవారి గుడి వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఆదివారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీఎంపీ వైద్యుడు కుమార్ యాదవ్ బీపీ పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎముకల పటుత్వానికి వృద్ధులు కొద్దిసేపు ఎండలో ఉండాలని, తద్వారా విటమిన్‌–డి లభిస్తుందన్నారు.

సర్పవరం రోడ్డుకు కోత



సర్పవరం మార్గంలో రమణయ్యపేట పేటకాల్వ వద్ద కోతకు గురవుతున్న రోడ్డు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామం వెళ్లే మార్గంలో రమణయ్యపేట గ్రామ పరిధిలోని పేటకాల్వ వద్ద ప్రధాన రహదారి కోతకు గురవుతోంది. నిత్యం రద్దీగా ఉంటే ఈ రహదారిని లక్షలాది రూపాయలతో నిర్మించారు. పేటకాల్వలో వెళ్లేందుకు డ్రైనేజీ నిర్మించలేదు. కచ్చా డ్రైనేజీ ఉండడంతో.. దాని ద్వారా వెళ్లే నీటితో రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో చాలా వరకు రహదారి దెబ్బతింది. రోడ్డు దెబ్బతింటున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. డ్రైనేజీ నిర్మిస్తే రోడ్డును కోత నుంచి కాపాడవచ్చని స్థానికులు అంటున్నారు. తక్షణం అధికారులు స్పందించి, రహదారిని కోత నుంచి కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం

కాకినాడ రూరల్: వాకలపూడిలోని కోరమాండల్ కర్మాగారం వర్కర్స్ కాంట్రాక్ట్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా పాతాళ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఫ్యాక్టరీ ఎదురుగా ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం 18 విభాగాల్లో పనిచేసే 600 మంది కార్మికులు యూనియన్‌లో సభ్యులుగా ఉన్నారు. న్యాయ సలహాదారుగా సలాది శ్రీనివాస్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ రాజు, జనరల్ సెక్రటరీగా దుర్గాప్రసాద్, కోశాధికారిగా లక్ష్మణరావు, పి.రాజును ఎన్నుకున్నారు. కార్మిక నాయకులు ఏసుబాబు, భద్రరావు పాల్గొన్నారు.

సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలి

బోట్‌క్లబ్: పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక గాంధీనగర్ క్షత్రియ పరిషత్ కల్యాణ మండపంలో ఆదివారం పార్టీ కాకినాడ సిటీ సెంట్రల్ మండల అధ్యక్షురాలిగా గోడి సత్యవతి బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ, తనపై ఉన్న నమ్మకంతో పార్టీ పెద్దలు అప్పగించిన పదవికి వన్నె తెస్తానన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావును ఆమె సత్కరించారు.

కార్డన్ అండ్ సెర్చ్‌లో వాహనాలు స్వాధీనం



కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా స్థానికులను ఆరా తీస్తున్న ఏఎస్పీ

కాకినాడ క్రైం: కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. పాత కేసుల్లో నేరస్తుడిగా ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో పోర్టు పీఎస్ సీఐ సునీల్‌కుమార్, త్రీ టౌన్ సీఐ కేవీ సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దవాఖానాలో డిష్యుం డిష్యుం

- జీజీహెచ్‌లో మితిమీరుతున్న కొట్లాటలు
- నాలుగు రోజుల వ్యవధిలో రెండు ఘటనలు
- క్షతగాత్రులపై ప్రత్యర్థుల దాడులు
- నియంత్రణలో పోలీసులు, ఆస్పత్రి వర్గాలు విఫలం



కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి

కాకినాడ క్రైం: ప్రసిద్ధి చెందిన కాకినాడ జీజీహెచ్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఘర్షణల్లో గాయాలపాలై.. వైద్యం కోసం వస్తున్న వ్యక్తులు, వారి ప్రత్యర్థుల కొట్లాటకు ఆస్పత్రి విభాగాలు, ఇక్కడి వార్డులు వేదికలవుతున్నాయి. అదుపుతప్పి, హద్దుమీరుతున్న ఇటువంటి హింసాత్మక ఘటనలు ఇతర రోగులకు సంకటంగా, సిబ్బందికి తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. వీరిని నియంత్రించడంలో అవుట్‌పోస్ట్ పోలీసులు సహా, ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది విఫలమవుతున్నారు. ఘర్షణలకు పాల్పడుతున్న వారిని నియంత్రించలేక తమ వల్ల కాదంటూ ఒక్కోసారి చేతులెత్తేస్తున్నారు. ఒక్కోసారి పోలీసులపైనా తిరగబడుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా ఘటనలు వారం రోజుల వ్యవధిలో రెండు చోటుచేసుకోవడం ఆస్పత్రిలో చర్చనీయాంశమైంది.

ఏం జరుగుతోంది

కాకినాడ జీజీహెచ్‌లో అత్యవసర విభాగంలో ఎమ్మెల్సీ, నాన్ ఎమ్మెల్సీ వార్డులుంటాయి. ఎమ్మెల్సీ వార్డులో చికిత్స పొందుతున్న కొందరు రోగులు, వారి వైరివర్గాల వైఖరి చుట్టూ వివాదాలు రాజుకుంటాయి. క్షతగాత్రులు ఘర్షణలు, వ్యక్తిగత, వర్గ విభేదాలు, కొట్లాటలు, హత్యాయత్నాల ఘటనల్లో గాయాలపాలై ఇక్కడ చేరుతారు. ఆయా ఘటనల్లో ప్రత్యర్థులు క్షతగాత్రులతో ఆస్పత్రి వరకు వచ్చి ఇక్కడ రచ్చ చేస్తున్నారు.

ప్రతీకారేచ్ఛతో..

ఘర్షణ చోటు చేసుకున్న ప్రాంతాల్లో వ్యక్తి మరో వ్యక్తిపై చేసిన దాడికి ఇద్దరూ లేదా కనీసం ఒక్కరు గాయాలపాలవుతారు. ఈ ఘర్షణల్లో ఎక్కువ మంది జోక్యం చేసుకుంటే మరింత మంది గాయాలపాలయ్యే అవకాశం ఉంటుంది. అలా గాయాలపాలైన వారిని స్థానికులు లేదా బంధువులు ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఈ క్రమంలో క్షతగాత్రుడిపై ప్రతీకారేచ్ఛతో వైరి వర్గం వారిని ఆస్పత్రికి తరలించడంలో ఇబ్బందులకు గురి చేయడంతో పాటు, ఆస్పత్రికి చేరినా చికిత్సకు ఆటంకం కలిగించేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కనీస విచక్షణ మరిచి ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడుతున్నారు.

అవుట్ పోస్ట్‌లో సిబ్బంది కొరత

కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది కొరతతో బలహీనంగా ఉంది. నామమాత్రంగా ఉన్న పోలీసుల సంఖ్య ఆస్పత్రిలో చోటు చేసుకుంటున్న అవాంఛనీయ సంఘటనలను అదుపు చేయడంలో విఫలమవడానికి కారణమవుతోంది. 54 వార్డులు 3 వేల మంది ఓపీ, 2 వేల మంది ఐపీ రోగులతో నిత్యం కిటకిటలాడే కాకినాడ జీజీహెచ్‌లో రాష్ట్రంలో ఉన్న అతి పెద్ద ఆస్పత్రులలో ఒకటి. ఇటువంటి ఆస్పత్రిలో భద్రత పర్యవేక్షణ కోసం కనీసం ఎస్సై స్థాయి అధికారి పర్యవేక్షణ కొనసాగించాల్సి ఉండగా, పోలీసు ఉన్నతాధికారుల్లో ఈ మేరకు ఆలోచన కానరావడం లేదు. అంతే కాకుండా 1+3(ఏఎస్సై/హెచ్‌సీ+కానిస్టేబుళ్లు) చొప్పున రెండు షిఫ్టుల్లో ఎనిమిది గంటల చొప్పున మొత్తం 8 మంది సిబ్బందిని జీజీహెచ్‌లో భద్రత, ఎమ్మెల్సీ కేసుల కోసం నియమించాల్సి ఉంది. కేవలం ఐదుగురితోనే అవుట్‌పోస్ట్ నడిపిస్తూ మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవాంఛనీయ ఘటనలు, ఘర్షణల సందర్భాల్లో, అందుబాటులో ఉన్న ఒకరిద్దరు పోలీసులు వచ్చి అడ్డుకోవాల్సి వస్తోంది. మూక విన్యాసాల ముందు వీరి ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఆస్పత్రి సెక్యూరిటీ కూడా ఈ విషయంలో పూర్తిగా విఫలమైంది. ఘర్షణల నియంత్రణలో వీరు సమర్థతను చాటుకోలేకపోతున్నారు. ఇటువంటి తరుణంలో అవుట్‌పోస్ట్‌ను మరింత పటిష్టపరచాల్సి ఉంది.

వైద్యానికి అంతరాయం కలిగిస్తే..

రోగి వైద్య సేవలు పొంది, పూర్తి సాంత్వనతో జీవించే హక్కును కలిగి ఉంటాడు. ఈ హక్కుకు భంగం వాటిల్లినా, అలాగే హింసాత్మక చర్యలతో ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యుల విధులకు ఆటంకం కలిగించినా చట్టప్రకారం కఠిన శిక్షలున్నాయి. 2020 చట్ట సవరణను అనుసరించి మూడు నెలల నుంచి ఐదేళ్ల వరకు కారాగార శిక్ష, రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటాయి.



కాకినాడ జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డులో కొట్లాట



ఆస్పత్రిలో కొట్లాటకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



ఆస్పత్రిలో కొట్లాటకు దిగిన వ్యక్తులను అడ్డుకుంటున్న ఏఎస్సై రవి

వారంలో రెండు ఘటనలు

కాకినాడ జీజీహెచ్‌లో వార్డులకు వచ్చి మరీ దాడి చేసిన ఘటనలు ఈ మధ్య కాలంలో రెండు చోటు చేసుకున్నాయి.

- పెదపూడి పీఎస్ పరిధిలోని రామేశ్వరంలో ఈ నెల పదిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు అక్కడికక్కడే కొట్టుకోగా, ఓ వర్గం వ్యక్తి ఆస్పత్రిలో చేరాడు. ఇతడిపై పుట్లేటి అర్జున్ అనే వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లోనే దాడికి పాల్పడ్డాడు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం ఉన్నతాధికారులకు చేరగా సతీష్‌పై కేసు నమోదైంది.
- కుటుంబ కలహాల నేపథ్యంలో కాకినాడ జగన్నాథపురానికి చెందిన గణేష్ అనే వ్యక్తి దారుణంగా ప్రవర్తించాడు. భార్యపై ఆమె చిన్నాన్నపై దాడి పాల్పడ్డాడు. వారు ఎమ్మెల్సీ చేయించుకుని చికిత్స పొందుతుండగా, గణేష్ ఆస్పత్రి వార్డులోకి వెళ్లి మరీ వారిద్దరిపై దాడికి పాల్పడ్డాడు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కరపలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

35 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

కరప: ఒరేయ్.. ఏం చేస్తున్నావురా, చాలా లావు అయిపోయావు, అసలు గుర్తుపట్టలేదనుకో.. ఒరేయ్.. ఎక్కడుంటున్నావురా, వ్యాపారం చేస్తున్నావంట, పిల్లలు ఏం చదువుతున్నారు.. అప్పుడెలా ఉన్నావో, ఇప్పుడూ అలాగే ఉన్నావు.. ఇలాంటి ఆత్మీయ పలకరింపులతో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలు, చిలిపి పనులు, అల్లరి చేష్టలు గుర్తు చేసుకున్నారు. మూడున్నర దశాబ్దాల తర్వాత కరప జెడ్పీ హైస్కూల్ 1989–90 బ్యాచ్‌కు చెందిన 80 మంది పదో తరగతి విద్యార్థులు స్థానిక పద్మప్రియ ఫంక్షన్ హాలులో కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, కరచాలనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితులంతా ఆనాటి ముచ్చట్లు చెప్పుకొంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆ బ్యాచ్‌కు చెందిన కోన ఉమేష్, ఆచారి, మేడిశెట్టి రేఖ, మేదరమాటి వెంకన్నచౌదరి, కొశెట్టి నాగేశ్వరరావు, వరలక్ష్మి, శ్రీదేవి, పద్మ, అబ్బులు, సక్కా చంటివీరన్న తదితరులు తమ బ్యాచ్ వారి చిరునామాలు సేకరించి, అందరూ కలిసేలా ఏర్పాట్లు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

‘యంగ్‌మైండ్’ సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ గాదె



అతిథులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

బాలాజీచెరువు: ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, సమాజానికి తనవంతు సేవ చేయాలనే ఉద్దేశంతో వాకాడ వెంకటరమణ(చిన్న) మాస్టారు యంగ్ మైండ్ సంస్థను స్థాపించి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసనాయుడు అన్నారు. సంస్థ స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా తొలి వార్షికోత్సవాన్ని స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ, యువతలో స్ఫూర్తి నింపేందుకు యంగ్‌మైండ్ సంస్థ ఏడాది కాలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. మరో అతిథి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ, సుమారు రూ.20 లక్షలు సేకరించి, 80 శాతం కాలిన గాయాలతో ఉన్న బాలికకు వైద్యం చేయించి, తిరిగి పాఠశాలకు వెళ్లేలా కృషి చేసిన మహనీయుడు వెంకటరమణ అని కొనియాడారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, కుట్టు మెషీన్లు, విద్యార్థులకు సైకిళ్లు, పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు అందజేశారు. అనంతరం సూర్య ఐకేర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, డాక్టర్ నితిన్, సందీప్, ఎంఈఓ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవసరాల మేరకు సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు ఇచ్చే స్పోర్ట్స్ కిట్లతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

బోట్‌క్లబ్: ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. రోటరీ క్లబ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ హాల్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తడాల బుజ్జి ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో పాఠశాలలకు క్రికెట్ కిట్లు, సినీ హీరో మహేష్‌బాబు కుమార్తె సితార పుట్టిన రోజును పురస్కరించుకుని ఆమె సౌజన్యంతో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్లు, నాలుగు కుట్టుమెషీన్లు అందించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, తాను రోటరీ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ రోటరీ సేవా కార్యక్రమాలు ఎంతో మంది నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సత్య, క్లబ్ డిస్ట్రిక్ కాన్ఫరెన్స్ చైర్మన్ తడాల వరప్రసాద్, సెక్రటరీ నామన రమేష్, సభ్యులు బోడవరపు మూర్తి, అంకూర్ సురాన, గమిని మూర్తి, సురభి శారద పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి నేడు శాకంబరిగా దర్శనం



ఆలయ పరిసరాలను కూరగాయలు, పండ్లతో అలంకరిస్తున్న భక్తులు, సిబ్బంది



శాకంబరి అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు

బోట్‌క్లబ్: ఆషాఢ మాసం సందర్భంగా నగరంలోని సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. సుమారు పది టన్నుల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో గర్భాలయంతో పాటు, ఆలయ పరిసరాలు సర్వాంగసుందరంగా అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. భక్తులు సమర్పించిన ఆకుకూరలను దండలుగా గుచ్చి అలంకరించినట్లు చెప్పారు. ఆలయ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం కూరగాయలను దండలుగా గుచ్చినట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శాకంబరిగా నూకాలమ్మ

ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక టూటౌన్ నూకాలమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. సుమారు 8 టన్నుల కూరగాయలతో ఆలయ పరిసరాలను అందంగా అలంకరించారు. వంకాయలు, బెండకాయలు, క్యాప్సికం, బెండకాయలు, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన గోంగూర, కరివేపాకుతో పాటు, వివిధ రకాల పండ్లతో అమ్మవారి గర్భాలయం సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ సుమారు వంద మంది భక్తులు సహాయంతో ఆలయాన్ని సుందరంగా అలంకరించినట్లు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలు కట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు, జిల్లా దేవదాయ శాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ తల్లి



ఆలయంలో బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: ఆషాఢ మాస మహోత్సవాల్లో భాగంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి సుమారు 1.50 లక్షల మంది భక్తులు తరలిచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లూ చేశారు. పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహించారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి వారం నిర్వహించే సంబరాల్లో భాగంగా కొత్తపేట, పాశిలి వీధి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

వ్యర్థానికీ ‘జీవం’

- రవివర్మలా.. ‘రంగరాయ’ విద్యార్థులా..!
- ఆర్‌ఎంసీలో కళా పోటీలు
- అబ్బురపరిచిన మెడికోల సృజనాత్మకత
- సబ్బుబిళ్లలు, వ్యర్థాలతో కళాకృతులు
- నలిగిన చొక్కాలు, పగిలిన కుండలు కావేవీ కళాఖండాలకు అనర్హం



పిస్తా షెల్స్‌తో వైద్య విద్యార్థిని మేఘన ఆవిష్కరించిన కళారూపం



సబ్బు బిళ్లలపై శ్రీనివాసిని, కార్తిక చెక్కిన రూపాలు



పగిలిన గాజు ముక్కలతో మెడికో భువనసాహితి తీర్చిదిద్దిన సీతాకోక చిలుక

కాకినాడ క్రైం: భవిష్యత్తులో వారంతా వైద్యులే. కేవలం వైద్య విద్యలోనే మునిగితేలక.. తమలోనూ సృజనాత్మకత ఉందని చాటిచెప్పారు. నిర్జీవ వ్యర్థాల్లోనూ తమ అద్భుత ప్రతిభతో జీవం పోశారు. వచ్చే నెలలో నిర్వహించనున్న కాకినాడ రంగరాయ వైద్య కళాశాల 67వ వార్షికోత్సవ సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆదివారం వైద్య విద్యార్థుల కళా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ సారథ్యంలో జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్, కల్చరల్ సెక్రటరీ డాక్టర్ కాళ్లకూరి శైలజ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 30 మందికి పైగా వైద్య విద్యార్థులు కుంచెతో అద్భుతాలు ఆవిష్కరించారు. కళారూపాలకు కాదేదీ అనర్హం అన్నట్టు సబ్బు బిళ్లలు, వ్యర్థాలపై కూడా కళాఖండాలు సృష్టించారు. నలిగిన చొక్కాలు, పగిలిన కుండలూ అబ్బురపరిచే అద్భుతాలంటూ తమ కుంచెలకు పదును పెట్టారు. సబ్బులపై కళాకృతులు చెక్కి ఆకట్టుకున్నారు. కుండపై మనోహరమైన చిత్రాలు వేసి పాట్ పెయింటింగ్ ప్రాధాన్యాన్ని చాటారు. ఆధునికతను అద్ది వేసిన టీ షర్ట్ పెయింటింగ్‌లు చొక్కాల రూపు రేఖల్నే మార్చేశాయి, చూపరులను కట్టి పడేశాయి.



అబ్బురపరిచిన పాట్ పెయింటింగ్



వ్యర్థాలతో విరిసిన పూలు



గోపి చిత్రలేఖనంలో కుసుమాంజలి

ఉన్నత విద్యనభ్యసిస్తున్న వైద్య విద్యార్థులు సామాజిక బాధ్యతతో పాటు, పర్యావరణంపై తమకున్న మక్కువను చాటుకున్నారు. మనుషులకు ప్రాణం పోసినట్టే.. వ్యర్థాలకూ జీవం పోశారు. వ్యర్థాలు కాదని, సరికొత్త అర్థాలను వివిధ రూపాల్లో ఆవిష్కరించారు. విద్యార్థుల సృజనాత్మకతకు డాక్టర్ విష్ణువర్ధన్ సహా, బోధకులు అబ్బురపడ్డారు. రవివర్మలా, రంగరాయ విద్యార్థులా అంటూ కీర్తించారు. విద్యార్థులను ముందుండి నడిపించి, పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన డాక్టర్ శైలజకు ప్రిన్సిపాల్ సహా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి ప్రత్యేక అభినందనలు తెలిపారు.